క్లుప్తంగా

కలెక్టర్ డీకే బాలాజీని కలిసిన కమిషనర్



పెడన: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన డీకే బాలాజీని పెడన మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా పెడన పురపాలక సంఘ స్థితిగతులను కలెక్టర్‌కు కమిషనర్ వివరించారు.

తండ్రి గెలుపునకు కుమార్తె ప్రచారం

లక్ష్మీపురం(చల్లపల్లి): తండ్రి గెలుపు కోసం కుమార్తె ఎన్నికల ప్రచారం చేశారు. శుక్రవారం సాయంత్రం చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు నాకలవారిపాలెంలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కుమార్తె నిశ్చల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేయాలని కోరారు. తన తండ్రి, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

అవనిగడ్డ పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి సస్పెన్షన్

అవనిగడ్డ: పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున అవనిగడ్డ పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్‌ను వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు మచిలీపట్నం ఎమ్మెల్యే, పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) తెలిపారు. ఆయనకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు.

విద్యతోనే ఉన్నత విలువలు

కోనేరుసెంటర్: విద్యతోనే ఉన్నత విలువలు లభిస్తాయని కృష్ణా యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య డి.రామశేఖర్‌రెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో శుక్రవారం రసాయన శాస్త్ర విభాగపు మొదటి సంవత్సర విద్యార్థులచే రెండో సంవత్సర విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సభ జరిగింది. రామశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ భవిష్యత్తులో ఉత్తమ ఉపాధ్యాయులుగా, పారిశ్రామికవేత్తలుగా రాణించాలని విశ్వవిద్యాలయ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని తెలిపారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.కె.సుందర కృష్ణ, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తుల వెల్లువ

పెడన: ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారితో పాటు ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సైతం పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తులు ఈ నెల 15వ తేదీ లోగా అందజేయాలని ఎన్నికల అధికారి ఆదేశాలతో పెడన తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఓపెన్ చేశారు. శుక్రవారం బంటుమిల్లి తహసీల్దారు వై.రవికుమార్ పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను స్వీకరించారు. పలువురు ఉద్యోగులు పలు సందేహాలు వ్యక్తం చేయడంతో వాటిని రవికుమార్ నివృత్తి చేశారు. ఉద్యోగుల ఐడీ కార్డు, ఆధార్ కార్డు, ఎక్కడ విధులు నిర్వహించేది ఆర్డరు, జిరాక్స్ కాపీలను ఫారం–12కు జతచేసి అందజేశారు.

నేడు కంచడం, ముంజులూరులో ప్రజాదీవెన

బంటుమిల్లి: మండల పరిధిలోని కంచడం, ముంజులూరు గ్రామాల్లో ప్రజాదీవెన కార్యక్రమం శనివారం ఉదయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ బంటుమిల్లి మండల కన్వీనర్ సుజ్ఞానం మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ ప్రజాదీవెన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) పాల్గొని గడప గడపకు ప్రచారం నిర్వహిస్తామన్నారు. జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న ప్రవచనం

మచిలీపట్నంటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక చిలకలపూడి శ్రీ విజయ సీతారామ స్వామి ఆలయ ప్రాంగణంలో మన గుడి కార్యక్రమంలో భాగంగా ప్రవచన కార్యక్రమం శుక్రవారం జరిగింది. శ్రీరామాయణం సీత చరిత్ర అనే అంశంపై బ్రహ్మశ్రీ జోష్యుల వేణుమాధవ ప్రసాద్ ప్రవచించారు. కార్యక్రమాన్ని టీటీడీ ప్రతినిధి తురగా ప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా మండలంలోని కంచాకోడూరు, ఆకులమన్నాడు, కంకటావ, లేళ్లగరువు, గంధ్రం, రామానుజవత్తర్లపల్లి, నాగవరం గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

మచిలీపట్నంటౌన్: శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఈడేపల్లి శ్రీనివాస నగర్ కాలనీ, జల్లు వారి వీధి, పోస్టల్ కాలనీ, పంచాయతీరాజ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మళ్లీ ఆశీర్వదించండి

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, ఉప్పాల రాము



ముక్కొల్లులో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి, రాములను సత్కరిస్తున్న నాయకులు

గూడూరు: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా గత ఐదేళ్లుగా సుపరిపాలన అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని కొనసాగించుకోవాలని పార్టీ బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా దీవెన యాత్రలో భాగంగా శుక్రవారం గూడూరు మండలం ముక్కొల్లు గ్రామంలో డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఉప్పాల రాము విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడంతో నేడు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. మేనిఫెస్టో అంటే ఒక భగవద్గీతగా, ఒక బైబిల్‌గా, ఒక ఖురాన్‌గా భావించిన జగనన్న ఐదేళ్ల కాలంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చేదిశగానే పరిపాలన సాగించారన్నారు.

ఘన స్వాగతం

కరోనా వంటి కష్టకాలంలోనూ వలంటీర్లను ఇంటింటికీ పంపించి ప్రజల బాగోగులు తెలుసుకున్న ఏకైక సీఎం వైఎస్.జగన్ మాత్రమే అన్నారు. అభివృద్ధి కొనసాగాలన్నా, ప్రజల జీవితాల్లో ఈ సంతోషాలు రానున్న కాలంలో కూడా కొనసాగాలన్నా మళ్లీ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచ్ సమ్మెట జయవర్ధన్, ఎంపీటీసీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ సమ్మెట సత్యం, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, నాయకులు పర్జం పెదబాబు, బూరగడ్డ శ్రీకుమార్ పాల్గొన్నారు. తొలిసారిగా ముక్కొల్లు వచ్చిన అభ్యర్థులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన అభ్యర్థులు ప్రజల బాగోగులు అడిగి తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు.

ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ పరిశీలన



ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన తొలి విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ డి.కె. బాలాజీ శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ప్రణాళికతో శాస్త్రీయంగా తొలి విడత ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించామన్నారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన నంబర్లు ఉన్న ఈవీఎంలను స్కానింగ్ చేసి తగిన భద్రతతో నియోజకవర్గాలకు తీసుకువెళ్తారన్నారు. ఈ ప్రక్రియలో ఒక నియోజకవర్గానికి వెళ్లాల్సిన ఈవీఎం మరో నియోజకవర్గానికి వెళ్లిందనే గందరగోళం లేకుండా పొరపాట్లు జరగకుండా బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈవీఎం గోడౌన్ నుంచి కట్టుదిట్టమైన భద్రత మధ్య నియోజకవర్గాలకు ఈవీఎంలను తరలిస్తామన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లలో వీటిని భద్రపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఈవీఎంల నోడల్ అధికారులు నాగేశ్వరనాయక్, ఎల్ నిత్యానందం, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దుర్గాకిషోర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అధికారులకు నేడు శిక్షణ

పెడన: పెడన నియోజకవర్గంలోని ఎన్నికల సిబ్బంది ప్రొసిడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రొసిడింగ్ అధికారులకు శనివారం శిక్షణ నిర్వహిస్తున్నట్లు పెడన ఎన్నికల అధికారి వెంకటరమణ తెలిపారు. మచిలీపట్నంలోని ముడా కార్యాలయంలో సెక్టోరియల్, నోడల్, ఎంఎల్ఎస్‌టీలతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ.. తనిఖీలను విస్తృతం చేయాలని ఆదేశించారు. సమావేశాలు, సభలు, ర్యాలీలకు, వాహనాలకు అనుమతులు ఉన్నది లేనిది కూడా తనిఖీలు చేయాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌లకు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శనివారం రెండో సెషన్స్‌లో శిక్షణ ఉంటుందన్నారు. పెడన మండలం నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తుకు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు ఎంప్లాయి ఐడీ కార్డు, ఎన్నికల ఆర్డర్ కాపీ జిరాక్స్‌లను ఫారం–12కు జత చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు శిక్షణ కేంద్రం వద్ద అందజేస్తామని తెలిపారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు)



కోనలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం అందిందని, పల్లె పల్లెలో అభివృద్ధి అడుగులు వేసిందని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) తెలిపారు. శుక్రవారం ఆయన మండలం పాతేరు, కోన గ్రామాల్లో గడప గడపకు సంక్షేమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ.. సమర్థవంతమైన సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యపడిందన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలంతా గమనించాలని కోరారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా, ఎన్నడూ జరగని విధంగా అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు జరిగాయన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన అనంతరం ప్రజల కష్టాలను పరిష్కరించారని చెప్పారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలుపరుస్తూ మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా ముందుకు సాగారన్నారు. చంద్రబాబుకు ఓటేయ్యమని ఎవరైనా మీ ఇంటికి వస్తే, అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం



మచిలీపట్నంటౌన్: నగరంలో వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) లను గెలిపించాలని కోరుతూ 50 డివిజన్లలో శుక్రవారం ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అభ్యర్థులను గెలిపించాలని వారు ప్రజలను కోరారు. 13వ డివిజన్‌లో కార్పొరేటర్ గాజుల శ్రీదేవి, డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాజుల భగవాన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే 3వ డివిజన్‌లో మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి, 18వ డివిజన్ కార్పొరేటర్ మేకల సుధాకర్‌బాబు(సుబ్బన్న), 20వ డివిజన్‌లో తిరుమలశెట్టి వరప్రసాద్, 33వ డివిజన్‌లో కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ, 34వ డివిజన్‌లో బడే భానుతేజ, 11వ డివిజన్‌లో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, 5వ డివిజన్‌లో వేముల వనబాబు, 44వ డివిజన్‌లో మామిడిబత్తుల అజయ్, 49వ డివిజన్‌లో కార్పొరేటర్ పల్లి శేఖర్, 36వ డివిజన్‌లో కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ తదితరులు ప్రచారాలు నిర్వహించారు.

ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం



పోలీస్ అధికారులతో డీఎస్పీ మురళీధర్

చల్లపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలను అవనిగడ్డ సబ్ డివిజన్‌లో ప్రశాంతంగా నిర్వహిస్తామని అవనిగడ్డ డీఎస్పీ పీ.మురళీధర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆలయాల సెంటరులో గ్రామస్థులకు ఎన్నికల కోడ్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, వారి అనుచరులు, సామాన్య ప్రజలు ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ దళాలను రంగంలోకి దింపి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సీహెచ్.నాగప్రసాద్, ఎస్ఐ సీహెచ్.చినబాబు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

పెడన: నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. పట్టణంలోని ఏడో సచివాలయం పరిధిలోని 18వ వార్డుకు చెందిన 9 మంది వలంటీర్లు తమ రాజీనామాలను ఆ సచివాలయ ఉద్యోగికి అందజేశారు. ఒకటో సచివాలయం పరిధిలో 14, రెండో సచివాలయం పరిధిలో ఏడుగురు రాజీనామాలను అందజేశారు. మండలంలోని జింజేరులో ఇద్దరు, నడుపూరులో 9 మంది, చెన్నూరులో 10, నందమూరులో 7, మడకలో 10 మంది వలంటీర్లు రాజీనామాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. పెడన మండలంలో 43 మంది రాజీమానా చేశారని ఎంపీడీవో రెడ్డయ్య తెలిపారు. వలంటీర్లు మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన నేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అన్న మాటలను భరించలేక రాజీనామాలను చేశామని వారు తెలిపారు.

చినగొల్లపాలెంలో 19 మంది..

కృత్తివెన్ను: నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న వలంటీర్ వ్యవస్థను కించపరిచేలా కొందరు స్వార్థపూరిత రాజకీయాలు చేయడంపై మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు. మండల పరిధిలోని చినగొల్లపాలెం–1 సచివాలయం పరిధిలోని 19 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. దీనిపై వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిస్వార్థ పాలన చేస్తున్నారని అటువంటి వ్యక్తికి తోడుగా ఉంటామని మళ్లీ తిరిగి త్వరలోనే ప్రజాసేవకు వస్తామన్నారు.

ఆలయ ప్రవేశం చేసిన గంగాభవానీ చిన్న అమ్మవారు

కోడూరు: స్థానిక గంగాభవానీ చిన్నఅమ్మవారిని పండితులు శుక్రవారం రాత్రి ఆలయ ప్రవేశం చేయించారు. అమ్మవారి జాతరోత్సవాల్లో భాగంగా ఈ నెల 6న అమ్మవారి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోడూరు, దింటిమెరక, స్వతంత్రపురం, వడ్డెరకాలనీ, వీవర్స్‌కాలనీ, నరసింహపురం, కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లో ఊరేగించారు. గ్రామోత్సవం ముగియడంతో చిన్నఅమ్మవారిని డప్పువాయిద్యాలు, బాణాసంచా వెలుగుల మధ్య ఆలయ ప్రవేశం చేయించారు. ఆలయంలో మహాకుంభం పోసి భక్తిభావం చాటుకున్నారు. యువకులు కర్రసాము, వీరతాడుతో విన్యాసాలు చేశారు. ఈ ఏడాది గ్రామోత్సవంలో జాప్యం జరగడంతో రెండు రోజుల ఆలస్యంగా ఆలయ ప్రవేశం చేసినట్లు ధరకర్త కోట యుగంధరరావు తెలిపారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో శ్రీ కోదండ రామాలయం వద్ద టీటీడీ ధర్మాచార్యులు వీరాంజనేయుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా టీటీడీ కో ఆర్డినేటర్ సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణా జిల్లా శాఖ ఆదేశాల మేరకు శ్రీ క్రోధి నామసంవత్సర ఉగాది సందర్భంగా ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా కుంకుమార్చన చేపట్టామన్నారు. కుంకుమ పూజ విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. ధర్మాచార్యులు అన్నపురెడ్డి కృష్ణ, అరజా ఏడుకొండలు, కేతరాజు నాగరాజ్, అర్జా నీలకంటేశ్వరావు, భజన సంఘం, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి చేస్తా

చిరువోలు(మోపిదేవి): మచిలీపట్నంలో పోర్టు అభివృద్ధి శరవేగంగా సాగుతుందని, మరో ఏడాదిన్నరలో పూర్తవుతుందని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. మండల పరిధిలోని చిరువోలు గ్రామంలో బీజేపీ నాయకుడు చిరువోలు బుచ్చిరాజు ఇంటి వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక మేరకు మచిలీపట్నం నుంచి రేపల్లెకు రైల్వే లైన్‌కు ప్రపోజల్‌ను పీఎం గజశక్తి ద్వారా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.350 కోట్లు తెచ్చామన్నారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్సర్ నూతన బైక్ ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని బజాజ్ షోరూమ్‌లో ఆ కంపెనీ విడుదల చేసిన పల్సర్ 150 యుజీ నూతన బైక్‌ను ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ నాగుల్‌మీరా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ మేనేజర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ బైక్‌లో పలు నూతన ఆవిష్కరణలు ఉన్నాయన్నారు. వినియోగదారులకు ఈ బైక్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఎక్స్ షోరూమ్ ధర రూ.1,12,301 గా, టిన్ డిస్క్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.1,16,237 గా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో బజాజ్ షోరూమ్ అసిస్టెంట్ మేనేజర్ మురళీ, ఈస్ట్ కృష్ణ కమాండ్ ఏరియా మేనేజర్ కెఎస్ఆర్కే ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల ప్రదాత అంబేడ్కర్



నివాళులర్పిస్తున్న వీసీ జ్ఞానమణి తదితరులు

కోనేరుసెంటర్: స్వాతంత్ర్య భారతదేశంలో మానవ హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి, రాజ్యాంగ రచన ద్వారా తనకొచ్చిన అవకాశాన్ని సాకారం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి కొనియాడారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ 134వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంబేడ్కర్ ప్రపంచ దేశాల్లో కీర్తింపబడుతున్నారన్నారు. విద్య ద్వారా మాత్రమే నిమ్న జాతుల స్థితిగతులు మారుతాయని గట్టిగా నమ్మిన వ్యక్తి అంబేడ్కర్ అని చెప్పారు. విద్యార్థులు అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్‌బాబు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌లో అనేక కోణాలు ఇమిడి ఉన్నాయని, ఒక్కో ఏడాది ఒక్కో కోణంను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు వెళ్లాలని కోరారు. తొలుత అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఉపకులపతి, రిజిస్ట్రార్ చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్సీ, ఎస్టీ విభాగం సమన్వయకర్త ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు సుందర కృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

లంకపల్లి(ఘంటసాల): మండల పరిధిలోని తూర్పు లంకపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నారసింహ స్వామి, అమృతలింగం, సీతాలక్ష్మణ హనుమంత్ సమేత శ్రీరాముల వారి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ.30 లక్షలతో నిర్మించిన దేవాలయంలో వేదపండితులు అడుసుమిల్లి హేమచంద్రరావు ఆధ్వర్యంలో అర్చక బృందం విశేష పూజలు, హోమాలు, శ్రీలక్ష్మీనారసింహస్వామి, సీతాలక్ష్మణ హనుమంత్ సమేత శ్రీ రాముల వారు, అమృత శివలింగం విగ్రహాలను ప్రతిష్ఠించారు. మహాపూర్ణాహుతిలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేలకు పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు గువ్వాబత్తిన శోభనాద్రి, కమిటీ సభ్యులు బుర్రా నాగరాజు, పతకూరి శ్రీనివాసరావు, మోత్కూరి హరిగోపాల్, ముద్రగడ రత్నగిరి పర్యవేక్షించారు. భవిష్యత్తులో దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి కల్యాణ మండపాన్ని నిర్మిస్తామన్నారు. నీటిసంఘం మాజీ అధ్యక్షుడు గువ్వాబత్తిన నాగేశ్వరరావు, పరిశే చలపతి, గ్రామస్తులు, లంకపల్లి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



వి.యశ్వంత్ (958 మార్కులు)

అవనిగడ్డ: ఇంటర్ ఫలితాల్లో ఎస్వీఎల్ క్రాంతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో భావిరెడ్డి ప్రభుసుజిత 470కి 464 మార్కులు సాధించగా, విస్సంశెట్టి సుజిత 463, అల్లంశెట్టి లిఖిత, చోడిశెట్టి సాయి భవాని 461, అన్నపరెడ్డి హాసిని, మేళ్లచెరువు వైష్ణవి 460, సీఈసీలో కుప్పా పావని 500కి 477 మార్కులు సాధించారన్నారు. సెకండియర్ ఎంపీసీలో ఉప్పాల ప్రియాంక, బుద్ధ శ్రీవైష్ణవికి 978, సీఈసీలో పొన్నం భావనకు 950 మార్కులు వచ్చాయన్నారు.

జిల్లాలో ద్వితీయ స్థానం..

అవనిగడ్డ: ఇంటర్ ఫలితాల్లో అవనిగడ్డ జూనియర్ కళాశాల జిల్లాలో ద్వితీయస్థానం సాధించిందని ప్రిన్సిపాల్ రేఖారాణి తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో ఎం.శ్వేతకు 951 మార్కులు వచ్చాయన్నారు. ఫస్టియర్‌లో 91 మంది పరీక్షకు హాజరుకాగా, 60 మంది ఉత్తీర్ణత, సెకండియర్‌లో 100 విద్యార్థులకు 84 మంది ఉత్తీర్ణత సాధించి, ప్రభుత్వ కళాశాలల్లో జిల్లాలో రెండో స్థానం సాధించిందన్నారు. ఒకేషనల్ ఇంటర్‌లో 20 మందికి 14 మంది, సెకండియర్‌లో 17 మందికి 10 మంది ఉత్తీర్ణత పొందినట్టు చెప్పారు. ప్రిన్సిపాల్ రేఖారాణి సంతోషం వ్యక్తం చేశారు.

గురుకుల బాలికల ప్రతిభ

చల్లపల్లి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఇంటర్ ద్వితీయ, ప్రథమ సంవత్సరం విద్యార్థినులు 92 శాతం, 87.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెకండియర్ బైపీసీలో సీహెచ్.వంశిక 968, ఎంపీసీలో ఎస్.వర్షిణి 953 మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో ఎం.వినీత 442, బైపీసీలో సీహెచ్.మధునయన 413 మార్కులు సాధించారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ పాముల అరుణ కుమారి, అధ్యాపకులు అభినందించారు.

'మారుతీ' విద్యార్థుల ప్రతిభ

కోడూరు: ఇంటర్ ఫలితాల్లో కోడూరుకు చెందిన మారుతీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఎంపీసీ ఫస్టియర్ విద్యార్థులు పి.నిఖిల్‌కు 454 మార్కులు, కే.లిఖిత 448 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ జే.వి.ఎస్.ఎస్.మూర్తి తెలిపారు. సీఈసీ గ్రూపులో ఎస్.రాజేష్‌కు 465, కె.గణేష్ 459 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో వి.యశ్వంత్‌కు 958, ఎస్.వర్ష 939 మార్కులు, సీఈసీలో జే.హరీష్ గోపి 926, పి.ఇందిర 923 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది.

బల్లిపర్రు గురుకులంలో 87.5 శాతం ఉత్తీర్ణత

పెడన: బల్లిపర్రు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 87.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ ఎన్ రూతమ్మ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 81.8 శాతం ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో 48 మంది విద్యార్థినులు హాజరవ్వగా 42 మంది ఉత్తీర్ణత అయ్యారన్నారు. ప్రథమ సంవత్సరంలో 44 మందికి 36 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ద్వితీయ సంవత్సంర సీఈసీ గ్రూపులో జె సింధూ 906, పి నాగవల్లిత్రూష్ణప్రియ 905 మార్కులు సాధించారని తెలిపారు. ఎంఈసీ విభాగంలో పి సాయి మేఘన 824, ప్రథమ సంవత్సరం ఎంఈసీలో తానంకి మైథిలి 462, గోసాల శిరి 407 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం సీఈసీలో ఉయ్యాల పావని 457, మంతిన చంద్రిక 429 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థినిలను వైస్ ప్రిన్సిపాల్ హెప్సిబా, అధ్యాపకులు, తాను అభినందించామన్నారు. పెడనలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 31 మంది విద్యార్థులకు 16 మంది ఉత్తీర్ణులై 51 శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ రామారావు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 30 మందికి 15 మంది పాస్ అయ్యారని 50 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీ గ్రూపులో పేరక సాయి హర్షిత 948 మార్కులు సాధించినట్లు ఆయన వివరించారు.

గురుకులం ముందంజ

మోపిదేవి: స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీర రవి తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో 34/34 మంది, బైపీసీలో 16/16, సీఈసీలో 23/23 మంది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పీహెచ్‌సీ రాజేంద్ర 962 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఫస్టియర్ ఎంపీసీలో 42/42, బైపీసీలో 10/9, సీఈసీలో 15/15 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. డీ సాయిరాజు అత్యధికంగా 470కి 457 మార్కులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను అభినందించారు. మోపిదేవి హైస్కూల్ ప్లస్‌లో సెకండియర్‌లో జ్ఞాన ప్రసన్న 933 మార్కులు సాధించగా, మొదటి సంవత్సరంలో ఉప్పాల రేవతి 353 మార్కులు సాధించినట్లు హెచ్ఎం జయంతి తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కృత్తివెన్ను: నూతన ఆలయ నిర్మాణానికి శుక్రవారం మండల పరిధిలోని గాంధీనగరం గ్రామంలో శంకుస్థాపన ఘనంగా జరిగింది. గతంలో స్థానికంగా ఉన్న నాగవిఘ్నేశ్వరస్వామి దేవాలయాన్ని తొలగించి అదే స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శంకుస్థాపన చేశారు.